

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

## (కిందటి సంచికనుండి కొనసాగింపు)

"**డిన్నర్‌కి నా ఫ్రెండ్స్ పిలిచారు**. సాయంత్రం ఐదుకి వెళ్దాం" అన్నయ్య అన్నాడు.

"డిన్నర్ ఫైవ్‌కా?" ఆశ్చర్యపోయాను.

"డిన్నర్ 7కి. కానీ వాళ్ళ రాంచ్‌కి వెళుతున్నారు. అక్కడ గుర్రాలు, అన్నీ ఉంటాయి. ముందు వెళితే నువ్వు అవన్నీ చూడొచ్చు."

"ఓ అవునా! నేను ఎప్పుడూ నిజం గుర్రాన్ని చూడలేదు."

అన్నయ్య నవ్వాడు.

"ఎంత దూరం?" అడిగాను.

"హాఫెనవర్."

"అంతేనా."

"యా. దారిలో ఒకసారి గ్రోసరీ స్టోర్‌కి వెళ్ళాలి."

"ఎందుకు?"

"తాగడానికి ఏమైనా కొని తీసుకు వెళ్ళాలి.నీకు జింజరేల్ ఓకే నా?"

"యా. ఓకే. వాళ్ళు ఇవ్వరా తాగడానికి?"

"ఇస్తారు. కానీ ఎవరివి వాళ్ళు తీసుకువెళతారు. ఇన్‌ఫాక్ట్, నువ్వు ఏదైనా వండితే అదికూడా తీసుకెళ్ళచ్చు. నేను వెజిటేరియన్ అని వాళ్ళకి తెలుసు, వెజ్ ఏదో ఒకటి ఉంటుందనుకో."

"వెజ్ ఏదైనా ఓకే నాకు."

"కావాలంటే ఇంటికి వచ్చాక అన్నం, ఆవకాయ తిను."

"సరే."

అన్నయ కొద్దిసేపు ఆఫీసు పని చేసుకున్నాడు. నేను టీవి చూస్తూ కాలక్షేపం చేసాను. నాలుగున్నరకి రెడీ అవ్వమన్నాడు. నేను వేసుకున్న జీన్స్, టీ షర్ట్ చూసి మార్చుకోమన్నాడు. నేను తెచ్చిన బట్టలు అన్నీ చూసి ఒకటి చేతికిచ్చాడు.

బయలుదేరేముందు తన జాకెట్ ఇచ్చాడు.

"ఇది నీది" అన్నాను.

"అవును" బదులిచ్చాడు.

"నాకు లూజ్ అవుతుంది."

"ఫరవాలేదు."

"నా జాకెట్ ఉంది."

"నువ్వు వేసుకున్నదానికి ఈ జాకెట్టే బావుంటుంది. లూజ్ అయినా స్టైలిష్‌గానే ఉంటుంది."

సరే అని వేసుకున్నాను. నాదానికన్నా వెచ్చగా బావుంది. జుట్టుకి రబ్బర్ బాండ్ పెడితే అన్నయ్య తీసెయ్యమన్నాడు. అలానే దువ్వి విరబోసుకున్నాను. అన్నయ్య ఒక టోపీ ఇచ్చి పెట్టుకోమన్నాడు. అదికూడా ఎంతో వెచ్చగా, హాయిగా ఉంది. కొద్దిసేపటికి బయలుదేరాము.

"నువ్వు కారులో ఉండు. నేను ఇప్పుడే వస్తా" అంటూ అన్నయ్య గ్రోసరీ స్టోర్‌లోకి వెళ్ళాడు. చెప్పినట్టుగానే వెంటనే వచ్చేసాడు.

"నీకు అక్కడ బోర్ కొడితే చెప్పు. వాళ్ళలో నీ వయసువారు తక్కువ ఉంటారు."

"ఫరవాలేదులే. బోర్ ఏమి కొట్టదు."

ఇద్దరం పాటలు వింటూ వెళ్ళిపోయాము. అక్కడ అందరికన్నా ముందు మేమే వెళ్ళాము. అన్నయ్య వాళ్ళ ఇంటిదగ్గర కన్నా ఇక్కడ ఎంతో చలిగా ఉంది. అన్నయ్య ఫ్రెండ్స్ కూడా మంచి వాళ్ళలానే అనిపించారు. వాళ్ళ రాంచ్ టూర్ ఇవ్వమని అన్నయ్య అడిగాడు. ఎంతో పెద్దగా ఉంది. లోపల అన్నీ ఖరీదైన డెకరేషన్లు ఉన్నాయి. సినిమాల్లో చూసిన ఇల్లులా ఉంది. ఏవి ఎక్కడ ఉండాలో అక్కడ ఉన్నాయి. కొంచెంకూడా దుమ్ములేదు. ఇంత పెద్ద ఇంటిని శుభ్రం చెయ్యాలంటే ఎన్ని గంటలు పడుతుందో.

వాళ్ళ దగ్గర మూడు కుక్కలున్నాయని చెప్పారు. అన్నయ్య వాటి దగ్గరకి వెళ్ళి ఆడుతుంటే నాకు ఎంతో భయమేసింది. అవి మూడు పెద్ద పెద్ద ఆల్సేషన్లు. అన్నయ్య నన్ను ముట్టుకోమన్నాడుకానీ నేను చాలా భయపడ్డాను. సగం సేపు ఆ కుక్కలకి కనబడకుండా దాక్కున్నాను. వాళ్ళ దగ్గర రెండు గుర్రాలు ఉన్నాయట. 'చూస్తారా' అని అడిగితే తలూపాను.

రెండు గుర్రాలూ నల్ల రంగులో ఉన్నాయి. అవి నాకన్నా ఎంతో ఎత్తు ఉండడంతో కాస్త భయపడ్డాను. గుర్రాలు తంతాయని, అలా తంతే ఎముక విరిగే ప్రమాదం ఉందని ఎవరో చెపితే విన్నాను. దాంతో నేను నాలుగైదు అడుగుల దూరంలో నిలబడ్డాను. అన్నయ్య దగ్గరికి వెళ్ళమని సైగ చేసాడు. నేను తల అడ్డంగా ఊపాను. గుర్రాన్ని ఎలా ముట్టుకోవాలో వాళ్ళు చూపించారు. నా చెయ్యి గుర్రం ముక్కుపై పెట్టగానే కొరుకుతుందేమో అని తెగ భయం వేసి చెయ్యి వణికింది. అది చూసి అంతా నవ్వేసరికి గుర్రం భయంతో కొరుకుతుందేమో అని వెంటనే తీసేసాను. అన్నయ్య నా చెయ్యి పట్టుకుని గుర్రాన్ని నిమిరాడు. గుర్రం శ్వాస ఎంతో వేడిగా ఉంది. దాని చర్మం మాత్రం ఎంతో నున్నగా ఉంది. అలా నెమ్మదిగా గుర్రాన్ని అలవాటు చేసి ఒక బ్రష్‌తో దాని జుట్టుని నాతో దువ్వించారు. ఆ గుర్రం కూడా నాకు ఎంతో అలవాటు పడినట్టు అనిపించింది. అలా కాసేపు ఆడుకున్నాక మరికొందరు రావడంతో లోపలికి వెళ్ళాము. నేను అనుకున్నట్టు అందరూ మా అన్నయ్య వయసు వారు కారు. ముసలివారు కూడా చాలామంది ఉన్నారు. వారితో స్నేహమేంటి? అని అన్నయ్యని తెలుగులో అడిగాను.

"ఆఫీసు అన్నాక అంతే. అందరూ మన వయసు వారు ఉండరు. కొంతమందితో అవసరం కోసం స్నేహంగా ఉండాలి, మరి కొందరితో స్నేహం వల్ల ఇలా కలుస్తుంటాము" అన్నాడు.

వచ్చిన వారు బీరు తాగటం చూసి ఆశ్చర్యపోయాను. ఒకటి పూర్తవగానే మరొకటి తెరిచారు. ఆడవాళ్ళు కూడా త్రాగటం చూసి కాస్త దిగులు, బాధ కలిగింది. అన్నయ్య, కేవలం ఒక్క జింజరేల్ మాత్రమే తాగాడు.

"నీ బ్రాతౌట్ వెజ్ ఫర్ యు" అని ఒకావిడ మా ఇద్దరికి చెప్పింది. అయితే ఆ వంట నాకు ఫిష్ వాసన వచ్చి తినలేదు. మేష్డ్ పొటాటో మరియు సలాడ్ మాత్రమే తిన్నాను. అన్నయ్య వెజ్ నగేట్స్ చాలా బావుంటాయంటే ఒకటి తినే ప్రయత్నం చేసాను కానీ నావల్ల కాలేదు. అన్నయ్య మాట విని ఏదైనా వండి తేవాల్సింది.

నా కాలేజీ గురించి, మా ఊరి గురించి ఎన్నో ప్రశ్నలు అడిగారు. అన్నయ్య ఇక్కడ ఉంటే అంత దూరం ఎందుకు వెళ్ళావు అని అందరూ అడిగారు. మొదటిలో ఉత్తిగా నవ్వి వదిలేసాను. కానీ అంతా అడగడంతో "బికాజ్ నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ స్టడీడ్ దేర్" అన్నాను.

అందరూ నేను ఒక జీనియస్ అనుకుని కెరీర్‌కి సంబంధించిన ప్రశ్నలు అడిగారు. ఆ తరవాత వాళ్ళ ఆఫీసు వారి గురించి మాట్లాడుకున్నారు. నాకు బోర్ కొట్టి ఫోన్‌లో ఫ్రెండ్స్‌తో చాట్ చేసాను. అన్నయ్య గుర్రంతో తీసిన ఫోటోని పంపి ఆ అనుభవాన్ని వివరించాను.

తిరిగి వెళ్ళేదారిలో "నువ్వు అందరితో బానే కలిసిపోయావు" అన్నాడు అన్నయ్య.

నేను చిన్నగా నవ్వాను.

"నీకు మరీ అంత భయమేంటి? కుక్క కరుస్తుందనుకోవచ్చు, గుర్రమంటే ఎందుకు భయం?" అడిగాడూ.

"గుర్రం తంతుంది" కోపంగా బదులిచ్చాను.

గట్టిగా నవ్వాడు.

"బోర్ కొట్టిందా?" అడిగాడు.

"లేదు. ఫ్రెండ్స్‌తో చాట్ చేసుకున్నా"

"షో ఆఫ్ చేసుకున్నావా?"

"లేదు."

"కొంచం వరకు ఫరవాలేదులే."

"నేను మామూలుగానే ఉన్నా" కోప్పడ్డాను.

"అక్కడ పెద్దగా తినలేదెందుకు?"

"ఎందులోనూ ఉప్పూకారం లేవు. ఇంటికెళ్ళాక ఆవకాయ, మజ్జిగ అన్నం తింటాను."

"ఇక్కడి భోజనం నీకు మెల్లగా అలవాటవ్వాలి. రేపు నా ఆఫీసు వాళ్ళని కలిసినప్పుడు తినకపోతే బావుండదు. కావాలంటే హాట్ సాస్ వేసుకుని తింటూ ఉండు."

"సర్వే."

"ఎలా అనిపించింది?"

"చాలా చాలా బావుంది. నీకు గుర్రం కూడా అలవాటా?"

"అప్పుడప్పుడూ రైడింగ్‌కి వెళ్తాము. అలా అలవాటైంది."

"పాపం గుర్రం మీద ఎక్కుతావా?"

"అదేదో గాడిదమీద ఎక్కినట్టు రియాక్ట్ అయ్యావేంటి?"

"దానికి పాపం నెప్పి కలగదూ? అలా ఎక్కకూడదు"

"అది గుర్రమే, మనిషో గేదో కాదు."

"అయినాకూడా."

మిగతా దారి నిశబ్దంగా ప్రయాణించాము. ఇంటికి వెళ్ళగానే స్నానం చేసి వేడి వేడి అన్నంలో ఆవకాయ పచ్చడి, సెనగపొడి, మజ్జిగతో తినగానే నా ప్రాణం లేచొచ్చింది. భోజనం పూర్తికాగానే నిద్రపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story